

వచ్చే నెల 29లోగా లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

కలెక్టరేట్, జనవరి 2: పింఛన్‌దారులు వచ్చే నెల 29లోగా లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని ఖజానా శాఖ ఉప సంచాలకులు ఆర్‌ఎస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పింఛనుదారుల నుంచి లైఫ్ సర్టిఫికెట్ స్వీకరించేందుకు జిల్లా ఖజానా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పింఛన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా లైఫ్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని కోరారు. సందేహాలుంటే హెల్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు.

ఆ సిమెంట్ సంగతేంటో!



ఖండ్యాంలో ఆరుబయట ఉంచడంతో పాడైన సిమెంట్ బస్తాలు

సచివాలయాలు, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాల భవనాలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు కేటాయించిన సిమెంట్ పక్కదారి పట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. రేగిడి మండలంలో కొద్దిరోజులుగా అధికారుల్లో దీనిపై చర్చ నడుస్తోంది. వాటిని ఎక్కడికి మళ్లించారు? ఏ విధంగా వినియోగించారు? లెక్క తేలకపోవడానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న ప్రశ్నలు సర్వత్రా విన్పిస్తున్నాయి. కనిపించకుండా పోయిన సిమెంట్ బస్తాల విలువ రూ.30లక్షలు పైమాటే. ఈ అంశం మండల సర్వసభ్య సమావేశంలోనూ చర్చకు వచ్చింది.



- రేగిడి మండలంలో కనిపించని 10వేల బస్తాలు
- మళ్లింపుపై అనుమానాలు
- వాటి విలువ రూ.30లక్షలు పైమాటే

రేగిడి, జనవరి 2: మూడేళ్ల కిందట ప్రభుత్వం పంచాయతీల్లో ఒకేసారి వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతి సచివాలయానికీ వద్దన్నా సిమెంట్ లోడ్లు పంపించింది. పర్యవసానం మూడేళ్ల తరువాత సిమెంట్ బ్యాగ్‌ల లెక్క తేలడం లేదు. మండలానికి వచ్చిన వేలాది బస్తాలు ఎక్కడ ఉన్నాయో ఇంజినీరింగ్, పీఆర్ సిబ్బంది స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. ఈక్రమంలో ఏ సచివాలయానికి ఎన్ని సరఫరా చేశారు? ఎవరు దేనికి వినియోగిం చారు? అన్నదానిపై లోతుగా ఆరా తీసుకుంటున్నారు. రేగిడి మండల ంలోని 25 సచివాలయాలకు గాను 2019 నవంబరు, డిసెంబరు నెలల్లో మూడు విడతులుగా 52,210 సిమెంట్ బస్తాలు సరఫరా చేసినట్టు పంచాయతీరాజ్ వర్గాల సమాచారం. మొదట్లో ఈబ్యాగ్‌ల సరఫరా అర్‌డబ్లుఎస్, పీఆర్ సిబ్బంది పర్యవేక్షణలో జరగ్గా తర్వాత రోజుల్లో అర్‌డబ్ల్యూఎస్ తప్పుకొందని ఆ విభాగం ఏఈ శ్రీచరణ్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మొత్తం నిల్వల్లో 10వేల బస్తాలవరకు లెక్క తేలట్లేదు. ఇదే విషయాన్ని పీఆర్ వర్గాలు ధ్రువీకరించాయి కాని పూర్తి వివరాలు చెప్పడం లేదు. అప్పట్లో కొన్నిచోట్ల భవనాల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ఇతర సచివాలయాలకు సర్దుబాటు చేసి నట్లు కొందరు సిబ్బంది చెబుతున్నారు. ఈసర్దుబాటులో లెక్కలేకుండా సిమెంట్ బస్తాలను పంపించినట్లు తెలుస్తోంది. స్టాక్ రిజిస్టర్ నిర్వహణ సరిగా జరగ లేదు. ప్రస్తుత నిర్మాణాలకు, స్టాకు సిమెంట్ బస్తాలకు పొంతన లేకపోవడాన్ని కొందరు అధికారులు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారం మెడకు చుట్టుకొనే ప్రమాదం ఉందని సిబ్బంది గుబులు చెందుతున్నారు. మరోవైపు భవన నిర్మాణాలూ కొలిక్కిరాలేదు. ఇంకా 40శాతం భవనాలు మధ్యలో నిలిచిపోయాయి.

● కనిపించకుండా పోయిన 10 వేల సిమెంట్ బస్తాలను ఇతర అవసరాల కోసం నేతలు వినియో గించినట్లు చెప్పుకుంటున్నారు. ఒక్కో బ్యాగ్ ధర రూ.300 అనుకుంటే రూ. 30లక్షల బస్తాలు లెక్క తేలాల్సి ఉంది. సిబ్బంది, నిర్మాణదారుల నిర్లక్ష్యం కూడా కొంత సిమెంట్ పోవడానికి కారణంగా తెలుస్తోంది. రేగిడి సచివాలయానికి సరఫరా చేసిన 620 బ్యాగ్‌లు రెండేళ్ల క్రితం ఒక గదిలో భద్రపరిచారు. నెలలు గడిచినా నిర్మాణం లేకపోవటంతో చాలా వరకు గడ్డలు కట్టి పాడయ్యాయి. దీనికి ఎవరు బాధ్యులో తేలాల్సి ఉంది. ఖండ్యాం సచివాలయానికి సరఫరా చేసిన వాటిలో కొన్ని బస్తాలు వేరే సచివాల యానికి సర్దుబాటు చేశారని సమాచారం. అయితే అక్కడ అరుబయట వేసిన వాటిలో 300 బ్యాగ్‌లు వర్షాలకు, ఎండలకు పాడయ్యాయి. ఇంకా సంకిలి సచివాలయానికి బొడ్డవలసలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్డుకు మంజూరైన 630 వరకు బ్యాగ్‌లు లెక్క తేలట్లేదు. ఇక్కడ రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. ఇక్కడి సిమెంట్ వేరే పనులకు మళ్లించినట్లు సమాచారం. ఇదేరీతిలో బూరాడ, ఆడవరం, ఉణుకూరు, పారంపేట, సరసనాపల్లి, కందిశ, చిన్నశిర్లాం, సోమరాజుపేట తదితర సచివాలయాలకు ఇవ్వాల్సిన సిమెంట్ ఇండింట్ కంటే వందలాది బస్తాలు ఎక్కువ వెళ్లినట్లు తెలుస్తోంది.

నేతలకు చెప్పినా స్పందన లేదు

వెంకటనాయుడు, సర్పంచ్, అంబాడ

అంబాడ పంచాయతీలో సచివాలయం, ఇతర భవనాలు నిర్మించాం. మాకు 2750 బస్తాలు రావాల్సి ఉంది. ఏడాదిగా అడుగుతున్నాం. ఇక్కడకు వచ్చిన సిమెంట్ వేరే సచివాలయానికి సర్దుబాటు చేశారు. వేరే పనులకు 500 బస్తాలు ఇచ్చినట్లు ఇటీవల చెప్పుకొచ్చారు. ఇంకా 2250 బస్తాలు రావాల్సి ఉంది. దీనిపై రెండుసార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో ఏఈని నిలదీశాం. అధికార పార్టీలో ఉండి కూడా మాకు అన్యాయం జరిగింది. నేతల సమక్షంలో గోడు వెళ్లబోసుకొన్నాం. అయినా స్పందన లేదు.

లెక్కతప్పిన మాట వాస్తవమే

రామకృష్ణ, ఏఈ, పంచాయతీరాజ్

అప్పట్లో సచివాలయ భవనాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్లుకు ఎక్కువ మొత్తంలో సిమెంట్ సరఫరా అయింది. సిమెంట్ పాడవుతుందన్న ఉద్దేశంతో పనులు చేయని సచివాలయాల నుంచి వేరే సచివాలయాలకు 10వేల బస్తాల వరకు సర్దుబాటు చేశాం. వాడుకొన్న సిమెంట్‌కు గాను ప్రస్తుత నిర్మాణ పనులకు పెట్టే బిల్లులో కోత విధిస్తాం. ఒకటి రెండురోజుల్లో నేతల సమక్షంలో సిమెంట్ లెక్కలు తేలుస్తాం. ఎక్కువ వెళ్లిన సచివాలయాల వద్ద నుంచి రికవరీ చేస్తాం.

నారా భువనేశ్వరి నేడు జిల్లాకు రాక

- 'నిజం గెలవాలి' సంఘీభావ యాత్ర మళ్లీ ప్రారంభం
- జిల్లాలో మూడు కుటుంబాలకు పరామర్శ
- రాజాం జీఎంఆర్ఐటీలో బస



రాజాం, జనవరి 2: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం జిల్లాలో పర్యటించ నున్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్రకు వస్తున్నారు. ముందుగా విజయనగరం జిల్లాలో బుధవారం పర్యటిస్తారు. ఇటీవల చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించి రూ.లక్ష వంతున సాయం అందించనున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అక్రమ కేసులో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. 52 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. అక్రమ అరెస్టుపై మనస్తాపానికి గురైన టీడీపీ అభిమానులు చాలామంది చనిపోయారు. మృతుల కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో వారిని పరామర్శించేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత చిత్తూరు జిల్లాలో పర్యటించారు. భర్త చంద్రబాబుపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు పాలుచేసిన వైనాన్ని ప్రస్తావించారు. ఆమెకు ప్రజల నుంచి విశేష మద్దతు లభించింది. విజయనగరం జిల్లాలో పర్యటిస్తున్న సమయంలో చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ లభించింది. దీంతో పరామర్శలను నిలిపివేసి ఆమె రాజమండ్రి వెళ్లిపోయారు. అనంతరం భర్తతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను సందర్శించారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం 'నిజం గెలవాలి' యాత్రను పునఃప్రారంభించేందుకు నిర్ణయించారు.

షెడ్యూల్ ఇలా..

భువనేశ్వరి బుధవారం ఉదయం 10 గంటలకు విజయవాడ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. 11.30 గంటలకు విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లో ఓ కుటుంబాన్ని పరామర్శించనున్నారు. అక్కడ నుంచి బొబ్బిలి వెళ్తారు. అటు తరువాత తెర్లాం మండలం పెరుమాళి, చీకటిపేటలో రెండు కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు రాజాం చేరుకుంటారు. జీఎంఆర్ఐటీలో బస చేయనున్నారు. అనంతరం గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తారు. భువనేశ్వరి పర్యటన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పార్టీ శ్రేణులు ఆమె పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున కోరారు. చెల్లూరు కూడలి వద్ద బుధవారం ఉదయం ఆమెకు టీడీపీ శ్రేణులు స్వాగతం పలకనున్నాయి.

వైసీపీలో అలజడి

- రాజాం ఇన్‌చార్జి మార్పు
- ఎమ్మెల్యే జోగులుకు పాయకరావుపేట బాధ్యతలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ రాజాం రూరల్: వైసీపీలో అలజడి రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పులతో ఇప్పటికే గరం గరంగా సాగుతున్న తంతులో భాగంగా రాజాం నియోజకవర్గంలోనూ మార్పులకు తెరతీశారు. ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న కంబాల జోగులును వేరొక జిల్లాలోని నియోజక వర్గానికి పంపుతున్నారు. అయితే సౌమ్యుడిగా పేరున్న ఎమ్మెల్యే జోగులును మార్చడంపై పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో రాజాంలో అభివృద్ధి జరగలేదన్న వాదన కూడా ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా కూడా ఈ ప్రాంత అభివృద్ధి కన్నా వ్యక్తిగత అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలు కొన్నాళ్లుగా విన్పిస్తున్నాయి.

కాగా రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ ఎముకుల వ్యాధి నిపుణుడు, వైసీపీ నాయకుడు డా.తలే రాజేష్‌కు రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నుంచి పోటీచేసే అవకాశాలు డా.రాజేష్‌కే ఎక్కువగా ఉన్నట్లు పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే రాజాం నియోజకవర్గంలో అభివృద్ధి లేకపోవడం.. పట్టణంలో రెండో విడత రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయలేని నిస్సహాయస్థితిలో ఉండడంతోనే కంబాల జోగులుకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయన్న వాదన ఉంది. రాజేష్ ఆర్నెళ్ల క్రితమే పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తండ్రి తలే భద్రయ్య తెలుగుదేశం పార్టీ తరపున పాలకొండ ఎమ్మెల్యేగా, ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.



ఉరితాలు వేసుకుని సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



అంగన్వాడీల వినూత్న నిరసన

ఆవేదన.. ఆగ్రహం

- నిరసన బాటలోనే సమగ్ర శిక్ష ఉద్యోగులు, అంగన్వాడీలు

కలెక్టరేట్, జనవరి 2: జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని.. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యమంలోకి దిగిన సమగ్ర శిక్ష ఉద్యోగులు, అంగన్వాడీలు ఒకటే సంకల్పంతో నిరసనలు కొనసాగిస్తున్నారు. రోజుకో రీతిగా ఆందోళన చేస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద ఉరితాలు వేసుకుని నిరసన తెలిపారు. అనంతరం రహదారికి ఇరువైపులా నిల్చొని నినాదాలు చేశారు. ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను అందజేయాలని డిమాండ్ చేశారు.

● సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం కలెక్టరేట్ వద్ద మోకాలిపై నిలబడి సీఎంకు దండం పెడుతూ ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేవరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు రమణ సుధారాణి, కె.ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఆందోళనలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)



కలెక్టరేట్ ముట్టడికి అంగన్వాడీలు సన్నద్ధం అవుతున్నారు. వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగ్రహంతో ఉన్నారు. మరింతగా ఉద్యమించాలన్న ఉద్దేశంతో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమవుతున్నారు. ఇతర ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు కూడా ఆందోళనలను కొనసాగిస్తున్నారు. మంగళవారం నిరుద్యోగ యువత విజయనగరంలో ర్యాలీ చేపట్టింది. గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఒక్కసారైనా డీఎస్సీ నిర్వహించేదని, వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్‌ను కనీసం అమలు చేయలేదని నిరుద్యోగులు విమర్శించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల ఉద్యోగులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా కలెక్టరేట్ ముట్టడికి సన్నద్ధం అవుతున్నారు. కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసనను కొనసాగిస్తున్నారు.



ఖాళీగా సురక్ష శిబిరం

పిలిచినా రాలేదు

- జగనన్న ఆరోగ్య సురక్ష-2 అభాసుపాలు
- మొహం చాటేసిన రోగులు
- కనీస సౌకర్యాలు లేక ఇక్కట్లు

మెంటాడ, జనవరి 2: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 మెంటాడ మండలంలో అభాసుపాలైంది. రోగులు లేక శిబిరం వెలవెలబోయింది. జగనన్న సురక్ష 1 కార్యక్రమం మొట్టమొదట పిట్టాడలో సెప్టెంబరులో లాంఛనంగా (పైలట్ ప్రాజెక్ట్) ప్రారంభించారు. కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై ఆర్భాటం చేశారు. సురక్ష-2 కూడా మంగళవారం పిట్టాడలో ప్రారంభించారు. స్థానిక సర్పంచ్, ఎంపీపీ స్వగ్రామం అయినా కూడా పెద్దగా హాజరు కాలేదు. సుమారు 12 గంటలు కావస్తోండడంతో స్థానిక వైసీపీ నాయకునితో శిబిరాన్ని ప్రారంభిం చారు. తరువాత కొద్దిసేపటికి ఎంపీడీవో త్రివిక్రమరావు వచ్చారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు వచ్చి ఉన్న కొద్దిమంది రోగులతో ఫొటోలు దిగి వెనుదిరిగారు. ఆరోగ్య పరీక్షల కోసం సచివాలయం పరిధిలో సుమారు 612 మంది పేర్లు రాయగా ఆపసోపాలు పడి వంద మందిని కూడా తీసుకురాలేక పోయారు. వలంటీర్లు,వెలుగు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి శిబిరానికి రవాలని కోరినా జనం ముఖం చాటేశారు. కాగా శిబిరానికి తీసుకువచ్చిన రోగులకు కనీసం మంచినీరు సౌకర్యం కల్పించలేదు. వైద్యులకు మినహా రోగులకు, వచ్చిన ఆశాలు, సిబ్బంది భోజనం లేక ఇబ్బంది పడ్డారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

- ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టుపై అనేక సందేహాలు
- బాధితులకు న్యాయం జరగదంటున్న వైనం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న న్యాయవాదులు
- చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్

బొబ్బిలి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమలులోకి తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు-2022పై ప్రజల నుంచి భిన్నమైన స్పందన వస్తోంది. ఎక్కువ మంది వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టం వల్ల భూ సమస్యలు పరిష్కారం కావని భావిస్తున్నారు. ఓ అధికారి(టీఆర్ఓ) నిర్ణయంపైనే అంతా జరగడంపై అభ్యంతరం తెలియజేస్తున్నారు. అన్యాయం జరిగిందని భావిస్తే బాధితుడు హైకోర్టులో మాత్రమే కేసు వేసుకోవాలి. పేదలకు సాధ్యపడుతుందా అనేది న్యాయవాదుల ప్రశ్న. కొత్త చట్టం ప్రభావంతో భూముల పరంగా అత్యంత విలువైన సేవలు అందిస్తున్న రిజిస్ట్రేషన్, రెవెన్యూ, న్యాయవ్యవస్థల ఉనికి ప్రశ్నార్థకమవుతుందన్న భావన బలీయంగా వినబడుతోంది. ప్రజానీకంతో పాటు న్యాయవాదులంతా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న వారి భూములు నిషేధిత జాబితాలో ఉండడం, డి.పట్టా భూమిగా నమోదు కావడం తదితర భూ వివాద బాధితులంతా కొత్త చట్టంపై గగ్గోలు పెడుతున్నారు. తమకు ఇక న్యాయం జరగదంటున్నారు.

● కొత్త చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్ఓ) పరిధిలోకి స్థిరాస్తులన్నీ వెళ్తాయి. ప్రతీ భూ లావాదేవీకి టీఆర్ఓ అనుమతి తప్పనిసరి. స్థిరాస్తి కొనుగోలు, తనఖా, దాన పత్రాలు అందజేయడం తదితర కార్యకలాపాలేవి చేసినా టీఆర్ఓ దగ్గర నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయనదే తుది నిర్ణయం. దీనిపై సాధారణ సివిల్ కోర్టులలో సవాలు చేసే వీలు లేదు. వివాద అంశాన్ని టీఆర్ఓ నమోదుచేసిన పక్షంలో దానిని సవాలు చేసుకునేందుకు హైకోర్టును మాత్రమే ఆశ్రయించాల్సి ఉంటుంది. కింది కోర్టుల్లో సవాలు చేసే వీలు లేదు. సామాన్య ప్రజానీకానికి నష్టం తెచ్చే ఏపీ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

● నూతన చట్టం ప్రకారం ప్రతీ ఆస్తి సంబంధిత అంశాలన్నీ టీఆర్ఓ కనుసన్నల్లో జరగాల్సి ఉంటుంది. ఆస్తిపై హక్కులకు ఎవరికైనా పవర్‌ఆఫ్ అటార్నీ ఇచ్చినా టీఆర్వో దగ్గర నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ నాయకుల చెప్పుచేతల్లో ఇప్పటికే వీఆర్ఓ, ఇతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందన్న అపవాదు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టీఆర్ఓ పేరుతో మరిన్ని అధికారాలను ఇస్తూ చట్టం చేయడం సరికాదంటున్నారు.

ప్రజలే కాపాడుకోవాలి

గోపాలకృష్ణ శర్మ, న్యాయవాది, బొబ్బిలి

ప్రజలు తమ స్థిరాస్తులు, ఇతర లావాదేవీలపై స్వేచ్ఛ, అధికారం, స్వతంత్రత కోల్పోతారు. కొత్త చట్టం భూతంలా ప్రజాసమూహాన్ని ఆవహించడం ఖాయం. ఈ చట్టం కోరల నుంచి ప్రజలు తమంతట తాముగా రక్షించుకోవాలి. చట్టాన్ని ఉపసంహరించుకోకుంటే సమాజంలో మరిన్ని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది.

అక్కరకు రాని చట్టం వ్యర్థం

వంగపండు మురళి, వ్యాపారి, బొబ్బిలి

ప్రజా బాహుళ్యానికి అక్కరకు రాని చట్టాల స్థానంలో బహుళ ప్రయోజనకర కొత్త చట్టాలు రావాలి. ప్రజలను ఆందోళనకు, అయోమయానికి గురి చేసే విధానాలు సరికాదు. న్యాయవాదులంతా సమిష్టిగా వ్యతిరేకిస్తున్న ఈ చట్టంపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిందే. ట్రిబ్యునల్స్‌కు అధికారాలన్నీ దారాదత్తం చేయడం అన్యాయం.



బొబ్బిలిలో వివాదంలో ఉన్న భూమి

విజయవాడలో నిర్ణయం తీసుకుంటాం

● మాజీ సర్పంచులు గేదెల, కర్రోతు

విజయనగరం, జనవరి 2: సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణ సిద్ధం చేసేందుకు నిర్ణయించాం. ఇందులో భాగంగా పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన విజయవాడలో బుధవారం జరిగే సమావేశానికి వెళ్తున్నామని దన్నానపేట మాజీ సర్పంచి గేదెల రాజారావు, పోలిపల్లి మాజీ సర్పంచి కర్రోతు సత్యనారాయణ స్పష్టం చేశారు. సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, అధికారాలను వైసీపీ ప్రభుత్వం తుంగలోకి తొక్కి హరించివేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందిస్తున్న నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించుకుపోయి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. గ్రామ స్థాయిలో ప్రజలకు అభివృద్ధి పనులు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. కనీసం వీధి లైట్లు, పారిశుధ్య పనులు చేయలేని పరిస్థితిని సర్పంచులు ఎదుర్కొంటున్నారు. జాతీయ ఉపాధి హామీ వంటి అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల అమలు, మంజూరు విషయంలో గతంలో ఉన్న అధికారాలను సర్పంచులు కోల్పోయారు. సర్పంచులు ఎదుర్కొంటున్న అన్ని ఇబ్బందులపైనా పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

పార్కు పనుల్లో కదలిక

శృంగవరపుకోట రూరల్: జిందాల్‌కు తాము ఇచ్చిన భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు త్వరలో ప్రారంభం కానుండడంపై నిర్వాసితులతో పాటు షేర్ హోల్డరు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో వారు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాస గృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇన్నాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఆమోదం తెలియజేయడం ఆనందం కలిగించిందన్నారు. తమ గోడును ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులను సత్కరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

వేపాడ: మండలానికి నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఫింఛన్లను బుధవారం వేపాడ సచివాలయ ఆవరణలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ పట్నాయిక్ తెలిపారు.

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని 24 వార్డుల్లోనూ ఈనెల 8వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎంవీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి ప్రభుత్వం రూ.250 వంతున పెంచడం వల్ల పంపిణీలో జాప్యం జరుగుతోందన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

విజయనగరం దాసన్నపేట: నగరంలోని కణపాకలో నిరుపేద కుటుంబానికి చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్రా ఆర్థిక సాయం అందజేశారు. తారకరామారావు కాలనీలో నివాసం వుంటున్న రెడ్డి తౌడు ప్రమాదంలో వెన్నుముఖ దెబ్బతిని ఆనారోగ్యంతో బాధపడుతూ, సిరి సహస్రాను సాయం కోరారు. వెంటనే స్పందించి వ్యాపార నిమిత్తం తోపుడు బండిని ఫ్యాన్సీ స్టోర్ సామాగ్రిని అందించి వారి జీవితాల్లో వెలుగులో నింపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తోట వాసు, జాకీరు హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, మూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఓని విద్యార్థినికి తానా ప్రశంసాపత్రం

పాలకొండ: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సాహుకారు సాయివర్షకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వారు ప్రశంసాపత్రం పంపించారని హెచ్ఎం బలగ నాగమణి తెలిపారు. తానా రూపొందించిన అమ్మ, నాన్న, గురువు పద్యాలను సాయివర్ష నేర్చి పఠించి గత నెల 19న పంపిన వీడియోను స్వీకరించిన సంఘ అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, వందే విశ్వమాతరం ఛైర్మన్ జయశేఖర్, తాళ్లూరి, తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుల్ల శ్రీనివాస్ అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని పంపారు. హెచ్ఎం బలగ నాగమణి, ఉపాధ్యాయులు పాలవలస శారదా కుమారి, గోగుల సూర్యనారాయణ, దానేటి పుష్పలత, సిద్దాబత్తుల వెంకటరమణ, కుదుమ తిరుమలరావు తదితరులు సాయివర్షను అభినందించారు.

అయోధ్య రామయ్య అక్షంతల పంపిణీ

గరుగుబిల్లి: దళాయివలస గ్రామంలో శ్రీరామ భజన సేవా మండలి సభ్యులు మంగళవారం ఇంటింటికి వెళ్లి, అయోధ్య రామ అక్షంతలను పంపిణీ చేశారు. గ్రామస్థులంతా సంతోషం వ్యక్తం చేశారు.

పాలకొండ: పట్టణంలోని నాగవంశపు వీధిలో రామాలయం వద్ద అయోధ్య రామాలయం నుంచి తీసుకొచ్చిన అంక్షింతలను మంగళవారం ఊరేగించారు. మహిళలు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని, అక్షింతలు పంపిణీ చేశారు. అయోధ్య వెళ్లలేని భక్తులకు ఈ అక్షింత లు తమ దగ్గరకు రావడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచండి

రేగిడి, జనవరి 2: పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వస్తున్న ఎటువంటి సామగ్రి వివరాలైనా స్టాక్‌బుక్‌లో నమోదు చేయాలని ఎంఈఓలు వరప్రసాదరావు, ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. ఇక్కడి ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం సమగ్ర శిక్ష నుంచి వచ్చిన పుస్తకాలను 81 పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

చీపురుపల్లి: చీపురు పల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదు వుతున్న ఎం.ప్రవల్లిక జాతీయ స్థాయి టెన్ని కాయట్ పోటీలకు ఎంపికయింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో డిసెంబరు 28 నుంచి 30 వరకూ జరిగిన 41వ అంతర్ కళాశాలల (పురుషులు, మహిళలు) పోటీల్లో మూడో స్థానం కైవసం చేసుకుని, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ జాతీయ పోటీలు ఈనెల 9 నుంచి 13 వరకూ పలాసలో జరగనున్నాయి. ఈసందర్భంగా ప్రవల్లికను కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.రమేష్‌కుమార్, డా.జ్వాలాముఖి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సురక్షను వినియోగించుకోండి

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చెర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు అన్నారు. ఆతవ ఎంపీపీ స్కూల్ ఆవరణలో మంగళవారం వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ.ధరణి, పి.వరలక్ష్మిల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సర్పంచ్ గొంప వేమన రాము, వైస్ సర్పంచ్ ఈశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ● **వంగర:** వీవీఆర్ పేటలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వ హించారు. శిబిరానికి రావడానికి జనం సుముఖత చూప కపోవడంతో నామమాత్రంగా నిర్వహించి మమ అనిపించారు.

తెగిన విద్యుత్ వైర్లు

బొబ్బిలి: స్థానిక కాలేజీ రోడ్డులో బాబా గుడి దగ్గర మంగళవారం విద్యుత్ సర్వీసు వైర్లు తెగిపడ్డాయి. పారాది వంతెనపై భారీ వాహనాలకు అనుమతి లేని కారణంగా పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్ రోడ్డు వైపు భారీ వాహనాలన్నీ వెళుతున్నాయి. ఈ మార్గంలో వైర్లు తెగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే

● గ్రామాల్లో బాబు ష్యురిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ● ఇంటింటికీ ప్రచారం చేసిన టీడీపీ నాయకులు



డెంకాడ: మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు



ఎస్.కోటలో మేనిఫెస్టోను పంపిణీ చేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట రూరల్: వచ్చే ఎన్నికల్లో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎంకేరావు కాలనీలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, కార్యకర్తలు తదితరులున్నారు.

డెంకాడ: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో మంగళవారం మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ సౌజన్యంతో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, భావి పౌరుల భవిష్యత్తు బాగుపడాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎన్నో అరాచకాలతో పాలన సాగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దిగిపోవాలని, జగన్ పోవాలంటే మనమందరం ఆచితూచి, ఆలోచించి అడుగు వేయాలన్నారు. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబునాయుడే రావాలన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు దిండి రామారావు, మాజీ సర్పంచ్ కోరాడ రమాదేవి, మాజీ ఎంపీటీసీ రమేష్, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి రాకకు ఏర్పాట్లు

● పర్యవేక్షించిన బేబీనాయన

తెర్లాం, జనవరి 2: మోదుగవలస గ్రామానికి చెందిన గులిపల్లి అప్పారావు, పెరుమాళి గ్రామానికి చెందిన ఫైలపల్లి పోలయ్య ఇటీవల చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు వార్త విని మరణించిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాలను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు తెలిపారు. టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పెరుమాళి గ్రామానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకొని కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భువనేశ్వరి పర్యటనలో భాగంగా పెరుమాళి, మోదుగవలస గ్రామాలను టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనా యన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు మంగళవారం సందర్శించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెరుమాళిలో పర్యటిస్తున్న బేబీనాయన, తెంటు

జయహో బీసీ సదస్సుకు టీడీపీ నాయకులు

గంట్యాడ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం (మంగ ళగిరి)లో ఈనెల 4న జరగనున్న జయహో బీసీ సదస్సుకు పార్టీ మండల నాయకులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు జెండాఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు అల్లు విజయకుమార్ పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కేఏ నాయుడు

నేటి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

రాజాం రూరల్, జనవరి 2: ఈనెల 3 నుంచి మున్సి పాలిటీలలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు మంగళవారం ప్రకటించారు. రాజాం మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ నాగరాజుతో మంగళవారం సిటు, మున్సిపల్ యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. గత ఏడాది డిసెంబరు 26 నుంచి సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతుగా ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెబాట పడుతున్నారని రామ్మూర్తినాయుడు కమిషనర్‌తో స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్, పారుగు సేవల సమస్యలు ఎదురైతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో హరి, అప్పలరాజు, కృష్ణ, సోమేశ్, మోహన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలి

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి

విజయనగరం దాసన్నపేట, జనవరి 2: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరయ్యే విధంగా అలాగే నిరంతరం వారి పట్ల పర్యవేక్షణతో ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. మంగళవారం నగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత పాఠశాలను అలాగే కంటోన్మెంట్‌లోని ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థులకు రుచికరమైన, నాణ్యత కలిగిన పోషకాహార పదార్థాలను అందించాలన్నారు. భోజన సమయంలో విద్యార్థులు ఇంటికి వెళ్లకుండా సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పిల్లలకు ఒత్తిడిలేని విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలితకుమారి, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి యాళ్ల నాగరాజు, ఉపాధ్యా యులు, సిబ్బంది పాల్గొన్నారు.



భోజనాలను పరిశీలిస్తున్న కేసలి అప్పారావు

కేంద్ర పథకాలపై అవగాహన

తెర్లాం, జనవరి 2: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ మేనేజర్ సుమ సాహు ఉద్దవోలు, గదబవలస గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు, ప్రతి ఇంటికీ మంచి నీటి కుళాయి, రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికీ విద్యుత్, అందరికి నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికి పౌష్టికాహారం, ఆరోగ్యం, జీవన ఉపాధులు మెరుగుపరచడం తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర గిరిజన సంక్షేమ సాధికార అధికారి టి.చంద్రశేఖర్, పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, జనవరి 2: పైడితల్లమ్మ చదురుగుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు.



చదురుగుడిలో వివిధ రకాల పువ్వులతో పైడిమాంబకు అలంకరణ

ఆడుదాం ఆంధ్రాకు నాణ్యత లేని బ్యాట్‌లు

● విరిగిన బ్యాట్ ● సొంతబ్యాట్‌లతో ఆడుతున్న క్రీడాకారులు

రాజాం, జనవరి 2: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి నాణ్యత లేని బ్యాట్‌లు సరఫరా చేశారనే విమర్శలు వినిపి స్తున్నాయి. పురపాలక సంఘ పరిధిలోని 11 సచివాలయాలకు 52 క్రికెట్ టీమ్‌లను ఎంపిక చేశారు. ఎక్కడా క్రీడా మైదానాలు లేకపోవడంతో స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో పోటీలు ఏర్పాటు చేశారు. మంగళవారం క్రికెట్ ఆడుతుండగా బ్యాట్ రెండు ముక్కలుగా విరిగిపోయింది. క్రీడాకారుల సొంత బ్యాట్‌లను వినియో గించాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రికెట్ బంతుల పరిస్థితీ అంతే. ఈ విషయంలో అధికారులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.



క్రికెట్ ఆడుతుండగా విరిగిన బ్యాట్

నేడు మడ్డువలస నీరు విడుదల

వంగర, జనవరి 2: రబీ సీజన్ కోసం మడ్డువలస కుడి, ఎడమ కాలువల ద్వారా బుధవారం ఉదయం 11 గంటలకు నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏఈఈ నితిన్ తెలిపారు. నాలుగు మండలాల్లో 13,500 ఎకరాలకు నీరు విడుదలకు సిద్ధం చేశామన్నారు. రైతులు ఆరుతడి పంటలు వేయాలని, వరి సాగు చేయరాదని సూచించారు.



నీటి విడుదలకు సిద్ధంగా ఉన్న కాలువ

స్టడీ మెటీరియల్ పంపిణీ

బొబ్బిలి, జనవరి 2: ఉద్యోగార్థులకు యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదికలు ఊతంగా నిలుస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ నేత ప్రసన్న కుమార్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయగౌరి మాట్లాడారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు రచించిన పుస్తకాలను గ్రూప్-2 అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. జేవీవీ నాయకులు పి.సత్యనారాయణ, శర్మ, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

కల్లుగీత కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

శృంగవరపుకోట రూరల్, జనవరి 2 : కల్లుగీత కార్మికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో కల్లు గీత వృత్తిదారుల సంఘ నియోజకవర్గ సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కామేశ్వరరావు మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ దానిని నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికులకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. డేగల అప్పలరాజు, పురం అప్పారావు, మద్ది కృష్ణ, కండిపల్లి భీముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామేశ్వరరావు

హనుమాన్ చాలీసా పారాయణం

బొబ్బిలి, జనవరి 2: స్థానిక తారకరామా కాలనీలో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రీరామ చంద్రుని అక్షింతలు భక్తులకు పంపి ణీ చేశారు. శ్రీరామ ఉపాసకులు బలిజేపల్లి రామజోడిరావు ఆధ్వ ర్యంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. 30వ వార్డు కౌన్సిలరు వాడపల్లి మనోజ్ కుమార్ దంపతులు, శ్రీరామసేన, షైనింగ్ యూ త్, శ్రీ అభయాంజనేయ స్వామి కోలాట బృందం భక్తులు పాల్గొన్నారు.



పల్లకీలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కేజీబీవీలో మురుగు సమస్య తీరదా?

వంగర, జనవరి 2: స్థానిక కేజీబీవీలో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో సిబ్బంది, విద్యార్థులు నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ మురుగునీరు పాఠశాల వెనుక భాగానికి వెళ్లడంతో ఇబ్బంది ఉండే ది కాదు. ఇటీవల పంట భూమిలోకి నీరు రానీయకుండా పొలం యజమానులు అడ్డుకోవడంతో పాఠశాల ఆవరణ చెరువులా మారింది. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా స్పందన కనిపించడం లేదు. ప్రత్యేకాధికారి రోహిణి మాట్లాడుతూ పాఠశాలలో మురుగునీరు బయటకు వెళ్లనీయకుండా రైతులు అడ్డుకున్న విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు.



మురుగునీటిని తోడిస్తున్న దృశ్యం

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి, జనవరి 2: సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో జిల్లా నాయకులు బంకురు జోగినాయుడు, జేసీ రాజు మాట్లాడారు. రెండు వారాల నుంచి సమ్మెలో ఉన్న ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని, వారందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మరికొన్ని సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్.ఎల్లయ్య, కరాసి సింహాచలం, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

రూ.20కు రూ.27 లక్షలు

● నిజమని నమ్మి మోసపోయిన బాధితుడు
● ఆన్‌లైన్‌లో సుమారు 3.90 లక్షలు నష్టపోయిన వైనం

కొత్తవలస, జనవరి 2: అత్యాశకు పోతే అసలుకే మోసం వచ్చింది. పాత నాణేనికి రూ.లక్షల్లో ఇస్తామని నమ్మబలికిన మోసగాళ్ల వలలో ఓ వ్యక్తి చిక్కుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేవాడ గ్రామానికి చెందిన కోన ఈశ్వరరావు(అయ్యప్ప) స్థానికంగా కిరాణా వ్యాపారంతో పాటు టెంటు హౌస్ అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల యూట్యూబ్ చూస్తుండగా పాత రూ.20 నాణెం ఉంటే రూ.లక్షలు గడించవచ్చుననే విషయం కనిపించింది. తన వద్ద పాత రూ.20 నాణెం ఉండడంతో యూట్యూబ్ చానెల్ లింక్‌పై క్లిక్ చేశాడు. తన వద్దనున్న పాత రూ.20 నాణెం ఫొటో తీసి చానెల్‌కు సంబంధించిన వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేశాడు. అక్కడి నుంచి చానెల్ నిర్వాహకులకు... ఈశ్వరరావుకు మధ్య లావాదేవీలు మొదలయ్యాయి. మొదట పాత రూ.20 నాణేనికి రూ.77 లక్షల వరకు ఇస్తామని నమ్మబలికారు. తరువాత కొద్దిసేపటికే మళ్లీ ఫోన్ చేసి ప్రస్తుతం మార్కెట్‌లో అంత ధర లేక పోవడంతో రూ.27 లక్షల కంటే ఇవ్వలేమని బేరసారాలు మొదలుపెట్టారు. అప్పటికే కొన్ని అప్పులతో సతమతమవుతున్న ఈశ్వరరావు ఎంతో కొంత వస్తుంది కదా అని రూ.27 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో వారు మోసానికి తెరలేపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రూ.1500 పంపించాలని కోరడంతో ఆయన ఆ మొత్తాన్ని పంపించాడు. రూ.27 లక్షలను పంపించడం కోసం ప్యాక్ చేస్తున్నట్టు కొన్ని ఫొటోలను పంపించారు. ఆ ఫొటోలను చూసిన ఈశ్వరరావు ఇదంతా నిజమనుకున్నాడు. సంబంధిత వ్యక్తులు ఈసారి జీఎస్టీ పేరుతో రూ.90 వేలు పంపించాలని కోరారు. అలా రూ.3.90 లక్షల వరకు పంపించాడు. చివరకు వాళ్లు టీడీఆర్ పేరుతో అర్జెంటుగా రూ.2.60 లక్షలు చెల్లిస్తే... ప్యాక్ చేసిన నగదును తమ వ్యక్తులు విశాఖపట్టణం ఎయిర్ పోర్టు వద్ద ఇచ్చేస్తారని తెలిపారు. వారికి రూ.20 నాణెం ఇచ్చి రూ.27 లక్షలు తీసుకోవాలని సూచించారు. అందుకు ఈశ్వరరావు సిద్ధమయ్యాడు. తన అకౌంట్‌లో రూ.1.60 లక్షలు మాత్రమే ఉండడంతో మిగిలిన రూ.లక్ష సమకూర్చేందుకు తన సన్నిహితుడైన రామలింగాపురానికి చెందిన కొల్లూరు శ్రీధర్‌ని అప్పుగా అడిగాడు. ఎంత వడ్డీ అయినా వెనకాడొద్దని చెప్పడంతో అంత అవసరం ఏమొచ్చిందని ఆయన ఆరాతీశాడు. దీంతో ఈశ్వరరావు అసలు విషయం చెప్పాడు. ఇది మోసమని ఆయన చెప్పినా నమ్మలేదు. దీంతో శ్రీధర్ పోలీసు శాఖలో తనకు తెలిసిన కొంతమందిని సంప్రదించాడు. అదంతా మోసమని వారు కూడా చెప్పారు. దీంతో ఇద్దరూ కలసి కొత్తవలస పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ వీరజనార్దన్ కేసు నమోదు చేశారు. ఈ మోసగాళ్లు ఢిల్లీకి చెందిన వారుగా తెలిందీ. ప్రస్తుతం ఈ డబ్బులు జమ చేసిన బ్యాంక్ అధికారులను సంప్రదించి బ్లాక్ చేయాలని కోరడంతో హోల్డ్‌లో ఉంచారు. అయితే...ఇప్పటికీ బాధితుడు ఈ మోసాన్ని గుర్తించినట్టు కనిపించడం లేదు. వారితో సంప్రదిస్తూ... మోసగాళ్లను నమ్ముతూనే ఉండడం గమనార్హం.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

బాడంగి, జనవరి 2: బావిలోకి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు అన్నపూర్ణ(27)కు అదే గ్రామానికి చెందిన రామారావుతో 2019లో సింహాచలంలో వివాహమైంది. అయితే రామారావుకు ఇది రెండో వివాహం. వీరికి మూడేళ్ల కూతురు మౌనిక ఉండగా మృతురాలు ప్రస్తుతం 3వ నెల గర్భిణి. మొదటి భార్య వద్దనే ఉంటూ భర్త తనను నిర్లక్ష్యం చేస్తుండడంతో పాటు తరచూ గొడవ పడుతుండడంతో విసుగుచెందిన అన్నపూర్ణ మంగళవారం గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తల్లి కర్రి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని సీఐ తిరుమల రావు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.



అన్నపూర్ణ

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీపురుపల్లి, జనవరి 2: చీపురుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఒకా పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్సై సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని వ్యక్తిగత వివరాలు తెలియరాలేదన్నారు. ఒడిశాలోని గంజాం ప్రాంతానికి చెంది, సూరత్‌లో పని చేస్తున్నట్టు గుర్తించామన్నారు. సోమవారం సూరత్ నుంచి ఒడిశా వెళ్తుండగా, ప్రమాద వశాత్తూ కాలు జారి పడి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతుని ఒంటిపై నీలి రంగు డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు. వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని 11 మేకలు మృతి

గుర్ల, జనవరి 2: మండలంలో ఎస్ఎస్.ఆర్‌పేట వద్ద మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో 11 మేకలు మృతి చెందాయి. మండల కేంద్రంలోని గొల్లవీధికి చెందిన కమ్మిండి అప్పలస్వామి మేకలను మేపేందుకు కొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో ట్రాకు దాటుతుండగా ఒక్కసారిగా వేగంగా రైలు వచ్చి ఢీకొట్టింది. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో 11 మేకల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. దీంతో మేకల కాపరి లబోదిబోమంటూ గ్రామస్థులకు సమాచారం అందజేశారు. తనకు న్యాయం చేయాలని అధికారులను, నాయకులను వేడు కుంటున్నాడు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని గ్రామ సర్పంచ్ ఇజ్జి రోతు ప్రసాద్, వైసీపీ నాయకులు మంత్రి వెంకటరమణ హామీ ఇచ్చారు.



మృతిచెందిన మేకలు

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

రాజాం రూరల్: గతేడాది డిసెంబరు 30 నుంచి తన భర్త సోములు కని పించడం లేదని పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన గౌరమ్మ మంగళవారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం సేవించి వచ్చిన భర్త సోముల్ని ప్రశ్నించడంతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు గౌరమ్మ పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్.ఐ. రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకు కమిటీ

కలెక్టరేట్, జనవరి 2: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం జిల్లా స్థాయి కమిటీని నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డీఐపీఆర్‌వో, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 220 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. అర్హులైన జర్నలిస్టులు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయం నిర్వహణ ఇలాగేనా?


శృంగవరపుకోట రూరల్, జనవరి 2: ధర్మవరం సచివాలయం తీరు సక్రమంగా లేకపోవడంపై గ్రామ యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలైనా సచివాలయ సిబ్బంది విధుల్లోకి రాకపోవడంతో ఖాళీగా ఉన్న సచివాలయాన్ని చూపించారు. ఇక్కడికి వివిధ పనులపై వచ్చిన తాము ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజల వద్దకు పాలన అంటూ ప్రశ్నించారు. ఈ విషయమై ఈవో రంగారావును వివరణ కోరగా... సచివాలయ సిబ్బందికి అంగన్‌వాడీల్లో విధులు కేటాయించడం వల్ల అందుబాటులో లేని పరిస్థితి ఎదురైందన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు భోజనాలు పెట్టి వచ్చి విధుల్లో చేరారన్నారు. కొంతమంది విధుల్లో భాగంగా వివిధ గ్రామాలకు వెళ్లారని తెలిపారు.



మంగళవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఖాళీగా వున్న ధర్మవరం సచివాలయం

ఓటరు నమోదుపై అవగాహన

వేపాడ, జనవరి 2: ఓటరు నమోదుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం ఆతవ, గుడివాడ గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను డీసీసీబీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడుతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరిగిపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుల్ల వెంకటరమణ, ఆతవ సర్పంచ్ గొంప వేమన రాము తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ, డీసీసీబీ ఛైర్మెన్

డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

● సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం ● దున్నపోతులకు వినతిపత్రం ఇస్తూ వినూత్నంగా నిరసన ● 22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె మంగళవారంతో 22వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వినూత్నంగా దున్నపోతులకు వినతిపత్రం అందజేశారు. కొన్నిచోట్ల ఒంటికాళ్లపై నిలబడి, కొన్నిచోట్ల వేపకొమ్మలతో నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. (ఆంధ్రజ్యోతి బృందం)


జామిలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తూ..


ఎస్.కోట: సంఘీభావం ప్రకటిస్తున్న సీఐటీయూ నేతలు


రామభద్రపురం: వైసీపీ నేతల చిత్రపటాలకు మొక్కుతూ..


బొబ్బిలి: మద్దతు తెలుపుతున్న జనసేన నాయకులు


రాజాం రూరల్: సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..


బాడంగి: ఒంటికాళ్లపై నమస్కారాలు చేస్తూ..


కొత్తవలస: దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


గజపతినగరం: దున్నపోతుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు


గంట్యాడ: 22 ఆకారంలో కూర్చున్న అంగన్‌వాడీలు


భోగాపురం: కోయిదొరల వేషంలో నృత్యం చేస్తూ..


సీతంపేట: దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


కొమరాడలో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో కానరాని పిల్లలు

● స్కూల్ పిల్లలకు గుడ్లు.. ప్రీస్కూల్ పిల్లలకు పులిహోర
● ఎంపీడీవో పరిశీలనలో వెల్లడి

మెంటాడ: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో ఉండడంతో ప్రీ స్కూల్ పిల్లలు కేంద్రాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. మంగళవారం పిట్టాడ కేంద్రాలను ఎంపీడీవో త్రివిక్రమరావు పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. గ్రామంలో రెండు కేంద్రాలు ఉన్నాయి. వాటిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. రెండు కేంద్రాల్లో కలిపి సుమారు 15 మంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు. కానీ ఒక్కరూ హాజరు కాలేదు. పిల్లలు ఎందుకు రాలేదని ఎంపీడీవో ప్రశ్నించారు. వచ్చి వెళ్లారని మహిళా పోలీసు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ బదులిచ్చారు. 12 గంటలకు ముందే ఎందుకు పంపించారని ఆయనప్రశ్నించారు. దీంతో సిబ్బంది అసలు విషయం బయట పెట్టారు. ఇంటి నుంచి కేంద్రాలకు తీసుకు వచ్చి.. మళ్లీ ఇంటికి పంపిస్తే పిల్లలను కేంద్రాలకు పంపిస్తామని తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారని అన్నారు. చిన్నారులను రోడ్డుపై వదిలేస్తే ప్రమాదాలకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ఇవన్నీ చూసుకోవడం తమ వల్ల కాదన్నారు. అంగన్‌వాడీ స్టాకును, ఎండీఎం వంటలను ఎంపీడీవో పరిశీలించారు. స్కూల్ పిల్లలకు గుడ్డు, పులిహోర, పచ్చడి సిద్ధం చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు అన్నం, పప్పు ఇవ్వవలసి ఉంది. కానీ పాఠశాల పిల్లల కోసం సిద్ధం చేసిన పులిహోరా ఇవ్వనున్నట్లు ఎండీఎం నిర్వాహకులు తెలిపారు. ఒకే చోట భోజనం చేసిన ప్పుడు ఒకరికి ఒకలా, మిగతా వారికి ఇంకోలా వడ్డించడం ఏమిటని వైసీపీ నాయకుడు రెడ్డి రాజప్పలనాయుడు ప్రశ్నించారు. 'మేమేమీ చేయలేమని.. ఇచ్చినదే వండుతున్నామని... గ్యాస్ మేమే భరిస్తున్నామ'ని వారు బదులిచ్చారు. ఇంతలో మండల ప్రత్యేక అధికారి వస్తున్నారని తెలిసి హుటాహుటిన వీఆర్‌ఏ వెళ్లి నలుగురు చిన్నారులను తీసుకొని వచ్చారు. తమ సమస్యలు ఆయన వద్ద సచివాలయ సిబ్బంది వెళ్లగక్కారు. 'నేను చెప్పానని చెప్పండి.. పిల్లలను కేంద్రాలకు తీసుకు రమ్మని తల్లిదండ్రులకు చెప్పండ'ని ఆయన అన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

పశువులకు గాలికుంటు టీకాలు

గంట్యాడ: ఈనెల 31 తేదీ వరకూ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ రెడ్డి కృష్ణ తెలిపారు. మంగళవారం నరవ గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తమ సిబ్బంది అందుబాటులో ఉండి ఉచితంగా టీకాలు వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఉన్నారు.


పశువులకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీ రెడ్డి కృష్ణ

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

చీపురుపల్లి: శ్రీరామతీర్థ ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం చీపురుపల్లిలో అయోధ్య రాముని అక్షింతలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి, ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల ప్రచార ప్రముఖ్‌లు వర్మ, శంకర్, శ్రీను, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


అక్షింతలను ఊరేగింపుగా తీసుకువస్తున్న హిందూ సంఘ్ ప్రతినిధులు

గిరిజనులను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలి



ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

మెంటాడ: మండలంలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా చేపట్టారు. గిరిజన గ్రామాలకు రహదారులు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండ లింగాలవలస, ఆంధ్ర, జయతి, గుర్ల, జీటీపేట, లోతుగెడ్డ పంచాయతీ మధుర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వివిధ సమస్యలపై తహశీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండలింగాలవలస సర్పంచ్ పాడి వరహాలమ్మ, గిరిజన సంఘ మండల కార్యదర్శి తామరాపల్లి సోములు, గేదెల పెదరాం, ఏలుసూరి ప్రకాష్, అగతాన గణేష్, సిడగం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

గజపతినగరం: ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఏవిధంగా ఓటు వేయాలో అవగాహన కల్పిస్తున్నామని ఈఆర్‌వో వెంకటేశ్వరావు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల్లో ఓటు వేసే విధానంపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోగల గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల్లో 262 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణకుమారి, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామతీర్థం దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానం-2024 క్యాలెండర్‌ను దేవస్థానం ఈవో బీ హెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సాగునీటికి ఇక్కట్లు

గుర్ల: పెనుబర్తి గ్రామంలో తోటపల్లి కాలువ పూడిక తీయకపోవడంతో సాగునీరు రావడం లేదని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువలు శుభ్రంచేసే కార్యక్రమం చేపట్టకపోవడంతో పంట పొలాలకు నీరు అందించలేని పరిస్థితి ఉందని దుయ్యబట్టారు. దీంతో రైతులంతా కలిసి చందాలు పోగు చేసుకొని తోటపల్లి కాలువ పూడికతీత పనులు ప్రారంభించారు.


కాలువను బాగుచేసుకుంటున్న రైతులు

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● డీసీసీ అధ్యక్షుడు రమేష్ కుమార్

నెల్లిమర్ల: దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనకు, ప్రస్తుత బీజేపీ పాలనకుగల తేడాలను ప్రజలకు వివరించారు. గ్రామ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యమయిపోయిందని అన్నారు. గత కాంగ్రెస్ పాలనను ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ మండల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు కనకల పద్మనాభం, తెలుగు సూరిబాబు, గురువులు, పార్టీ నాయకులు రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో 'ఆరోగ్య సురక్ష'

గుర్ల: ఆనందపురంలో ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాలను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

గంట్యాడ: మండలంలోని రామవరం, బుడతనాపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మంగళవారం ప్రారంభించారు. దీనికి ముందు రామవరం గ్రామంలో ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హైమావతి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైసీపీ నాయకులు జైహిందకుమార్, నారాయణమూర్తి రాజు పాల్గొన్నారు.